# గంగా విలాపం

డా. కొఠారి వాణీ చలపతిరావు

''గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధింకురు''

దేవుడి గదిలో నుండి మా బామ్మ కంచు కంఠం ఇల్లంతా మారుమ్రోగి పోతున్నది.

ఈమధ్య మా బామ్మ తీర్థయాత్రలు చేసి వచ్చింది. పుణ్యక్షేత్రాలు దర్శించి పుణ్య తీర్థాలలో మునిగివచ్చినప్పటి నుంచి 'స్వర్గద్వారాలు' గ్యారంటీగా నాకోసం తెరిచి వుంటాయి అన్న గట్టి నమ్మకం ఆమెకు కలిగిపోయింది. అందుకే ఆ హుషారులో పూజల జోరు మరింత పెంచేసింది. ఇంటికి వచ్చిన వయోవృద్ధులను ఒకళ్లనుకూడా వదిలిపెట్టకుండా ''మీరు తీర్థయాత్రలు చేసారా?'' అని ప్రశ్నిస్తున్నది. ''లేదు'' అని అవతలి నుండి సమాధానం వచ్చిందంటే బామ్మ ఇక రెచ్చిపోయి తన యాత్రా విశేషాలను పూసగుచ్చినట్లు వాళ్లకు వినిపిస్తున్నది. చివరన నాలుగు క్షేత్రాలు తిరిగి పుణ్య నదుల్లో స్నానం చేయని మీ జన్మ ఒక జన్మేనా అన్నట్లు ఎదుటివాళ్లను ఎగతాళి చేస్తున్నట్లు మాట్లాడుతున్నది.

నాకు మా బామ్మను మాటలతో ఏడిపించడమంటే భలే సరదా.

''బామ్మా! కాశీయాత్ర చేసి వచ్చినప్పటి నుండీ దిగ్విజయ యాత్ర చేసి ఈ ప్రపంచం మొత్తాన్ని గెలిచినంత సంబరపడిపోతున్నావు. బామ్మా! అసలు నువ్వు కాశీ వెళ్లింది ఎందుకే? కాశీ విశ్వనాథుని మీద భక్తి కన్నా గంగలో మునిగి పవిత్రమైపోవాలన్న స్వార్థమేకదా''

''అవునురా ఆదిత్యా. ఆ గంగ ఎంత పవిత్రమైనదనుకుంటున్నావు. ఎక్కడెక్కడి నుండో భక్తులు వచ్చి అందులో స్నానాలు చేస్తారు. సర్వరోగ నివారిణి '' అంది బామ్మ.

''రోగాలు నివారణ కావడం ఏమోగానీ కొత్త రోగాలు రావడం మాత్రం గ్యారంటీ. రకరకాల అంటు రోగాలు వున్నవాళ్లు వచ్చి ఒకే ఘాట్‌లో పక్కపక్కన స్నానాలు చేస్తారుకదా. వాళ్ల రోగాలు వీళ్లకు వీళ్ల రోగాలు వాళ్లకు అంటుకోవా బామ్మా'' అని అడిగాను అమాయకంగా ముఖంపెట్టి.


నా మాటలు బామ్మ మీద మంచి ఎఫెక్ట్ చూపించాయిలా వుంది. టపటపా ఆ చెంపా ఈ చెంపా బాదుకుని ''అప్రాచ్యపు మాటలు మాట్లాడకురా అంట్ల వెధవా'' అంది.

మా బామ్మ ముఖంలోని అమాయకత్వం, ఆమె హావభావాలు చూస్తుంటే నాకు నవ్వాగలేదు.

ఆమెను మరికాస్త ఉడికించాలని అనిపించింది.

''బామ్మా! గంగలో స్నానం చేస్తే మనం చేసిన పాపాలన్నీ నిజంగా తొలగిపోతాయా?'' అన్నాను అమాయకంగా ముఖంపెట్టి.

ఆ మాటలకు నన్ను ఇట్టే నమ్మేసి గంగా మహత్మ్యం గురించి గడగడా గుక్క తిప్పుకోకుండా చెప్పేసింది.



''బామ్మా! గంగ పాప నివారిణి అంటున్నారుకదా. అలా అయితే నువ్వు పనివాళ్లకు, జీతగాళ్లకు డబ్బులు అప్పు ఇచ్చి వడ్డీ పేరిట వాళ్లను నానా తిప్పలు పెడతావు కదా. ఆ పాపం పోయినట్లేనా ఇక'' బామ్మ గుర్రుగా చూసింది నావంక.

''అస్తమానం పూజలు, వ్రతాలు చేస్తూ తాతయ్య కడుపు మాడ్చి వేళకు తిండి పెట్టవుకదా. బానంత నోరు చేసుకుని పాపం ఆ బక్కప్రాణిని తిట్టిన తిట్టు తిట్టకుండా ఆడుకుంటావుకదా. ఆ పాపం కూడా కంచికెళ్లినట్లేనా''

''అరేయ్...అరేయ్ నీ నోటికి మరీ అదుపు లేకుండా పోతున్నది. నా కొడుకు రానీ నీ సంగతి చెబుతాను.''

''బామ్మా! గయ్యాళీ అత్తగా భద్రకాళి రూపం దాల్చి కోడళ్లను రాచి రంపాన పెడతావు కదా. పాపం అన్నెంపున్నెం ఎరుగని పిన్నిమీద బాబాయికి చాడీలు చెప్పి వ్యవహారం విడాకుల వరకు తెచ్చావుకదా. ఆ పాపం కూడా హుష్ కాకీ అయినట్లేనా?''

''వెధవ... నిన్ను'' అంటూ బామ్మ చేతి కర్ర తీసుకుని వెంటపడడంతో చటుక్కున లేచి సందుకు పరుగెత్తాను బామ్మకు

దొరక్కుండా.

''ఏమిట్రా గొడవ, మళ్లీ బామ్మతో పోట్లాటకు దిగావా?'' అని మందలించింది అమ్మ సందులో బట్టలు ఆరేస్తూ. నేను బామ్మతో వాదన పెట్టుకున్నప్పుడల్లా బామ్మ నా మీద కోపాన్ని అమ్మ మీద చూపిస్తుంది.

''ఏం పెంపకాలని. మరీ పెద్దంతరం చిన్నంతరం లేకుండా పోతున్నది. మా కాలంలో మేమూ పెంచాముగానీ'' అంటూ విరుచుకుపడుతుంది. అందుకే అమ్మ భయం అమ్మది.

బామ్మ కాశీ నుంచి వస్తూ ఓ డజను గంగ చెంబులు తెచ్చింది దగ్గరి బంధువులకు, ఇరుగుపొరుగులకు ఇవ్వాలని, ఆఖరి క్షణాలలో వున్నవారికి ఆ గంగ తీర్థం తాగిస్తే నేరుగా బొందితో కైలాసానికి పోతారట. చిన్న ఆ రాగి చెంబు ముచ్చటగా అనిపించి మెల్లగా ఒకటి తీసి నేను దాచేసుకున్నాను అలమారలో.

బామ్మ ఒకటికి పదిసార్లు లెక్క చూసుకుని ఎవరెవరికి ఇచ్చింది గుర్తు చేసుకుని ఒక చెంబు తక్కువ వస్తోందని తెగ మనాది పడిపోయింది.

''బామ్మా! స్వేచ్ఛగా ప్రవహించే గంగను ఇలా మూతి బిగించిన ఈ రాగి చెంబులో బంధించి తెచ్చావుకదా. పాపం కాదుటే'' అన్నాను రాగి చెంబు అటూ ఇటూ తిప్పి చూస్తూ.

''పవిత్ర గంగా జలాన్ని పూజా మందిరంలో పెట్టుకోవడానికి నేను తెస్తే పాపం అంటావేమిటిరా నీ పిండాకూడు'' అంటూ నా మాటల్లోని భావం అర్థంకాని బామ్మ గుడ్లెర్ర చేసి నావంక చూసింది.

బామ్మ తన కాశీ యాత్ర విశేషాలను అమ్మకు, నాన్నకు ఇంటికి వచ్చిన ఇరుగుపొరుగులకి పూసగుచ్చినట్లు సీరియల్ కథలా చెబుతున్నది. ఈమధ్య పుస్తకాలు ముందేసుకుని నా గదిలో నేను కూర్చున్నా. బామ్మ మాటలు గంట కొట్టినట్లు నా చెవిలో మోగుతూనే వున్నాయి.

''గంగా తీరంలో ఎక్కడ ఎప్పుడు చూసినా సందడే సందడి. పితృకర్మలు చేయడానికి వచ్చినవాళ్లు, శవ దహనాలకు వచ్చినవాళ్లు, ఇసుక వేస్తే రాలనట్లు క్యూలు కట్టి వుంటారనుకో. హరిశ్చంద్ర ఘట్టం దగ్గర కాలుతున్న చితిమీది శవాలను పూర్తిగా కాలకముందే కర్రలతో గంగలో నెట్టేస్తూ వుంటారు. స్నానఘట్టాల దగ్గర లోపలికి దిగి స్నానాలు చేస్తూ వుంటే నీళ్లలో కొట్టుకొచ్చిన శవాలు ఒక్కోసారి కాళ్లకు తగులుతూ వుంటాయి. నిజానికి అక్కడి వాతావరణం వళ్లు గగుర్పొడిచేదిగానే వుంటుంది. అయినా పవిత్ర గంగా తీరాన వున్నామన్న భావం, కాశీలో చనిపోయి నేరుగా స్వర్గానికి చేరుకుంటున్న ఆ అదృష్టవంతులను చూడగలుగుతున్నామన్న ఆనందం... ఇవన్నీ ఆ కాసేపు మరో విషయాలను పట్టించుకోనీయకుండా చేస్తాయి.'' బామ్మ మాటలు వింటుంటే నా మనసంతా అదోలా అయిపోయింది. ప్రతి చిన్న విషయానికి స్పందించే అలవాటును చిన్నతనం నుండీ అలవర్చుకున్న నా మనసు గంగ దయనీయ గాథను విని తీవ్ర అలజడికి గురైంది. ఆ మనోక్షోభలో ఎప్పుడు నేను నిద్రలోకి వరిగానో నాకే తెలియదు.

మనసంతా దూదిపింజలా మారిపోయింది నా భుజాలకు రెక్కలు మొలిచినట్లు. నేను ఎక్కడికో ఎగిరిపోతున్నట్లు అనుభూతి కలిగింది. అలా అలా ఆకాశంలో తేలిపోతూ వుంటే క్రింద భూమి మీదనుండి ఎవరో స్త్రీ హృదయ విదారకంగా విలపిస్తున్న ధ్వని వినిపించింది.

అంతే భూమి మీదకు దిగిపోయాను ఠక్కున. చుట్టూ పరిసరాలను పరకాయించి చూస్తే అది గంగాతీరంలోని మణికర్ణికా ఘట్టం అని తెలిసింది. ఒడ్డున ఇసుకలో కూర్చుని ఏడుస్తున్న ఆ స్త్రీ తెల్లటి చీర కట్టుకుని అలలలాంటి నల్లటి కురులు దీపంలా పరుచుకుని వుంది. కూర్చుని ఏడుస్తున్న ఆమెని చూడగానే ఒకప్పుడు ఈమె చాలా అందగత్తె అనిపించింది.

ఇప్పుడు మాత్రం వెన్నెలను తలపించే తెల్లటి ఆమె వస్త్రం మైలతో, మురికితో అసహ్యంగా వుంది. ఆమె వంటిమీద నుండి ఏదో దుర్గంధం వస్తోంది. ముఖం నిండా, చేతుల నిండా కుష్టురోగాన్ని తలపించే మచ్చలు వళ్లు గగుర్పొడిచేలా వున్నాయి. ఆమె దగ్గరికి వెళ్లి జాలిగా ఆమెవంక చూసాను.

''ఎవరమ్మా నువ్వు? ఎందుకు ఏడుస్తున్నావు? నీకేం కష్టం వచ్చింది?'' అని ప్రశ్నించాను. ఆమె చటుక్కున నావంక చూసింది. నీటి పొరలు కప్పేసిన ఆమె కళ్లల్లో చెప్పలేనంత ఆశ్చర్యం తొంగి చూస్తోంది.

''ఎంతోకాలంగా ఇక్కడ కూర్చుని అలా రోదిస్తున్నా ఎవరూ 'ఎందుకు ఏడుస్తున్నావు?' అని అడగలేదు. సానుభూతిగా మాట్లాడి ఒక్కరూ ఊరడించలేదు. అసలు ఎవరూ తన గోడు వినడానికయినా ప్రయత్నించలేదు.

అలాంటిది ఈరోజు ఒక బాలుడు తన దగ్గరకి వచ్చి తన బాధకు కారణం అడుగుతున్నాడు అన్నదే ఆమె ఆశ్చర్యానికి కారణం.

''బాబూ! ఆప్యాయంగా దగ్గరకొచ్చి అడిగావు కనుక చెబుతున్నాను. నీకు చెప్పుకుంటే నా బాధ కొంతైనా ఉపశమిస్తుందన్న ఆశతో చెబుతున్నాను విను. నా పేరు గంగ. ఒకప్పుడు వైభవంగా శివుని జటాఝూటంలో, బ్రహ్మ కమండలంలో, విష్ణు పాదాలలో మెలిగేదాన్ని. జనుల మేలుకోరి ఈ భూమిమీదకు వచ్చాను. కానీ ఇప్పుడు ఇక్కడ రానురాను నా పరిస్థితి

## కంగారు

కంగా(రావు బస్సులో నిలబడి ప్రయాణిస్తున్నాడు. కండక్టరు అటుగా వెళ్తూ ''సీట్లు ఖాళీగా వున్నాయి కదాసార్, నిలబడటమెందుకు, కూర్చోండి'' అన్నాడు.

''ఇప్పుడు అర్జంటుగా యింటికి వెళ్ళి మా ఆవిడను తీసుకొని మార్కెటుకు వెళ్ళాలి. సారీ కూర్చునే టైములేదు'' అన్నాడు కం(గారావు చిరాగ్గా.

- పి. రాధిక
(హంపసాగర)

నికృష్టంగా తయారైంది. పాపనాశని అంటూ జనులు ర కరకాల పాపాలుచేసి వచ్చి ఆ పాపాలను నాలో కడుగుతున్నారు. వ్యాధిగ్రస్తులు సర్వ రోగ నివారిణి అంటూ తమ రోగాలను నాలో వదిలేస్తున్నారు. పాపుల పాపాలు కడిగీ కడిగీ ఇప్పుడు నేను మైలపడిపోయాను. రోగిష్టుల శరీరాలను శుభ్రపరిచీ పరిచీ నేను రోగిష్టిలా మారిపోయాను. అసలు ఈ జనులు పాపాలు ఎందుకు చేయాలి? చేసిన పాపానికి ఫలితం తాము అనుభవించక నాకు ఎందుకు అంటగట్టాలి? ఇదిగో ఇటుచూడు చనిపోయినవారి అస్తికలు, సగం కాలిన శవాలు నా కడుపులో ఎలా తిరుగుతున్నాయో. స్వచ్ఛమైన నా జలం ఎలా కలుషితమైపోయిందో చూడు. నా మూలంగా తాము కలుషితమై పోతున్నామని వాయుదేవుడు, వరుణదేవుడు నన్ను నిందిస్తున్నారు. సంప్రదాయాల పేరిట నమ్మకాల పేరిట తరతరాలుగా ఈ జనులు నాకు చేస్తున్న అన్యాయాన్ని ఎవరు వచ్చి తొలగిస్తారో ఎవరు నన్ను రక్షిస్తారో బోధపడడంలేదు. ఎప్పుడు నాకు విముక్తి?'' అని వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పింది గంగ.

అప్రయత్నంగానే నా చేయి ముందుకు సాగి గంగ కన్నీళ్లను తుడిచింది.

''ఏడవకు గంగా. నేను వచ్చానుగా. నాలాంటి వాళ్లు ఇంకా చాలామంది వస్తారు. నీ కన్నీళ్లను తుడుస్తారు. కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు'' అన్నాను ఓదార్పుగా.

ఆనందంతో గంగ కళ్లల్లో స్వచ్ఛమైన నీటి తళతళలు కనిపించాయి. నా మీద పూర్తి నమ్మకం ఏర్పడినట్లు కుదుటపడ్డ ఆమె మనసు చెప్పక చెబుతున్నది.

ఇంతలో వున్నట్టుండి ఎవరో వీపున చరిచినట్లు ఉలిక్కిపడి లేచాను. అకస్మాత్తుగా నా కల చెదిరిపోవడానికి కారణం ఇల్లంతా ఏడ్పులతో గగ్గోలుగా వుండడం. మా తాతయ్య కూర్చున్నవాడు కూర్చున్నట్టు పోయాడు. బామ్మ గుండెలు బాదుకుని ఏడుస్తోంది.


నిర్ఘాంతపోయి లేచి కూర్చున్నాను.

తాతయ్య అంత్యక్రియలు ముగిసిపోయాయి. మూడో రోజు తాతయ్య అస్తికలను గంగలో నిమజ్జనం చేయడానికి నాన్నను, బాబాయిలను కాశీకి ప్రయాణం చేయిస్తున్నది బామ్మ.

ఆ ప్రయత్నాలు చూసి నా గుండెలు గుబగుబలాడిపోయాయి. గంగా విలాపం ఒక్కసారిగా తిరిగి నా చెవుల్లో మారుమ్రోగింది. గంగకు నేనిచ్చిన వాగ్దానం గుర్తుకువచ్చింది. చిన్నవాడిని నా మాట ఎవరు వింటారు? అయినా పట్టుదలతో పోట్లాడాను.

బామ్మా, నాన్నా ముందు నా మాట వినలేదు. గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్టుందని ఎగతాళి చేసారు. 'అస్తికలు, చితాభస్మం గంగలో కలపకపోతే మీ తాతయ్యకు పుణ్యగతులు ఉండవురా' అని వాపోయింది బామ్మ.

''బామ్మా! నీవన్నీ మూఢనమ్మకాలే. ప్రతి ఒక్కరు ఇలా చచ్చిపోయినవారి




అస్థికలను, బూడిదను పవిత్రమైన గంగా జలంలో కలుపుతూపోతే నలుగురికి ఉపయోగపడాల్సిన ఆ నీరు ఎంత కలుషితమైపోతుందో తెల్సా. సమాజానికి, సాటి మనుష్యులకు హాని కలిగించే పనులు చేసి మోక్షాన్ని, సుఖాన్ని ఆశించడం అజ్ఞానం కాదా బామ్మా. కాలం మారుతోంది. కాలాన్నిబట్టి ఒక్కోసారి సిద్ధాంతాలు, ధర్మశాస్త్రాలు సైతం తిరిగి రాయక తప్పదే. ఒకప్పుడు గర్భ నిరోధం నేరమన్నారు. కానీ దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా అది ఇప్పుడు తప్పనిసరి అయింది. ఈ జనాభా ఇలాగే పెరిగిపోతే ముందు ముందు మనిషి ఈ భూమిమీద నిలబడడానికి కూడా చోటు వుండకపోవచ్చని గుర్తించారు కాబట్టే పుట్టుకలను ఆపవలసి వచ్చింది. అలాగే ప్రస్తుతం ఈ ప్రపంచాన్ని కాలుష్యం అనే భయంకర ప్రమాదం ఆవరించింది. ఇప్పటికైనా మేల్కొని మనం జాగ్రత్త పడకపోతే మరి కొన్నాళ్లకు ఈ భూమిమీద మానవ మనుగడే దుర్భరమైపోతుంది'' అన్నాను హృదయమంతా ఆక్రమించుకున్న ఆవేదనను వ్యక్తం చేస్తూ.

కొంచెం ఆలస్యంగానైనా వాళ్లు నా మాటల్లోని యదార్థాన్ని గ్రహించారు. దాన్ని గురించి ఆలోచించారు. చివరకు ఎలాగైతేనేం తాతయ్య అస్థికల నిమజ్జనం అనే కార్యక్రమం ఆగిపోయింది. అదే నా ప్రథమ విజయం. దాన్ని ఆసరాగా మరింత విజృంభించాలని, మరిన్ని మంచి పనులు చేసి సమాజానికి మేలు చేయాలని నిశ్చయించుకున్నాను.

★